క్లుప్తంగా

సరోజమ్మ కుటుంబానికి పరామర్శ



సరోజమ్మ మృత దేహానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం: సీకాయపట్టెడ గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకురాలు బి.సరోజమ్మ(85) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారమందుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి ఆ గ్రామానికి వెళ్లి సరోజమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, పార్టీ మండల మాజీ కన్వీనర్ ధనుంజయవర్మ తదితరులు ఆ గ్రామానికి వెళ్లి సరోజమ్మకు నివాళులర్పించారు. మంత్రి వెంట సర్వేశ్వర్, మాధవ నాయుడు, ధర్మయ్య, పురంధర్, మురళీకృష్ణా రెడ్డి, రాము, శేఖర్, చిన్ని ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రంలో ఆర్ఓ వరప్రసాద్

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను ఆర్ఓ వరప్రసాద్ మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, నీటి సౌకర్యం, వెలుతురు తదితర అంశాలకు సంబంధించి ఆరా తీశారు. అలాగే పెద్దపోడుచేనులో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసి, వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంఈఓ మహేశ్వరావు, ఈఓపీఆర్డీ పురుషోత్తం, డీడీఓ శ్రీనివాసరావు, కార్యదర్శి ఇందు, సచివాలయం సిబ్బంది సింధూజ, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి



అధికారులకు పోలింగ్ ఏర్పాట్లపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ భాస్కర్

గంగాధరనెల్లూరు: మే నెలలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని తహసీల్దార్ రవి, ఎంపీడీఓ భాస్కర్ సచివాలయం అధికారులకు సూచించారు. మండలంలోని పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేయాల్సిన మౌలిక వసతులపై వారికి అవగాహన కల్పించారు. ఎన్నికల విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైభవంగా శ్రీకాలభైరవ అష్టమి పూజలు



చందనాలంకారంలో కాలభైరవ స్వామి

నగరి: కామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలోని శ్రీకాలభైరవ స్వామి సన్నిధిలో మంగళవారం కాలభైరవాష్టమిని పురస్కరించుకొని ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. పాలు, పెరుగు, పంచామృతం, చందనం, విభూది, పన్నీరు, కొబ్బరినీళ్లు మొదలగు వాటితో స్వామికి అభిషేకం చేసిన అనంతరం పుష్పాలంకరణ చేయగా భక్తులను అమితంగా ఆకర్షించింది. పూజలో పాల్గొన్న భక్తులందరికీ, ఆలయ నిర్వాహకులు చందనం, పసుపు, విభూదిని ప్రసాదంగా అందజేశారు.

హుండీని పగులగొట్టిన దుండగులు

పాకాల: గుర్తు తెలియని దుండగులు శ్రీకామాక్షి సమేత ఏకాంబరేశ్వర స్వామి దేవస్థానంలోని హుండీని పగలగొట్టిన సంఘటన సోమవారం రాత్రి మణిపిరెడ్డిపల్లికి సమీపంలో చోటు చేసుకుంది. మంగళవారం ఆలయ ధర్మకర్త కె.సంపూర్ణంపిళ్లై మాట్లాడుతూ రోజూ మాదిరిగానే ఉదయం 4.30 గంటలకు ఆలయం వద్దకు వెళ్లగా ఆలయం ప్రధాన గేటుకు వేసిన తాళాలు పగలగొట్టి కింద పడేసి ఉన్నారు. అలాగే హుండీ తాళాలు కూడా పగలగొట్టి ఉండడాన్ని గమనించినట్లు పేర్కొన్నారు. ఆలయ హుండీలో సుమారు రూ.10,000 వరకు ఉంటాయని తెలిపారు. అనంతరం ఆలయానికి సమీపంలో నివాసం ఉంటున్న తన కుమారుడికి ఫోన్ ద్వారా సమాచారాన్ని అందించి, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రేపు మా పిల్లల పరిస్థితి ఏంటి?



దివ్యాంగులైన అక్కాతమ్ముడు

నా పేరు జమున. మాది శ్రీరంగరాజపురం మండలం 50 బసివిరెడ్డిపల్లె దళితవాడ. అసలే కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాం. ఒకరోజు కూలి పనులకు వెళ్లకపోతే పూటగడవదు, నాకు షర్మిల(18), లక్ష్మణ్(14) ఇద్దరు దివ్యాంగ పిల్లలు ఉన్నారు. వారు నడవ లేరు, లేచి కూర్చోలేరు. మా అన్నయ్య సీఎం జగనన్న మా పిల్లలకు మేనమామగా ఇద్దరికీ ఇంటి వద్దే పింఛన్లు అందిస్తూ వచ్చారు. ఎన్నికల కోడ్ సాకుతో చంద్రబాబునాయుడు ఇంటి వద్ద అందించాల్సిన పింఛన్‌ను సచివాలయాల్లో అందించేలా పుణ్యం కట్టుకున్నారు. సచివాలయానికి వెళ్లాలంటే సుమారు నాలుగు కిలోమీటర్లు వెళ్లాల్సిందే. ఎవరి సాయంతో మా పిల్లలను అంత దూరం తీసుకెళ్లాలో తెలియడం లేదు. ప్రతిపక్షాల పుణ్యామా అంటూ వృద్ధులు, వికలాంగులపై కనీసం కనికరం లేకుండా మాలాంటి పేదల కడుపులు కొడుతున్నారు. మా గోడు మీకు తప్పకుండా తగులుతుంది. **–జమున, 50 బసివిరెడ్డిపల్లి,శ్రీరంగరాజపురం మండలం**

ఈ నెల ఎలా బతకాలయ్యా...



తెలుగుదేశం చంద్రబాబూ!.. వలంటీరు జయలక్ష్మమ్మ మా ఇంటి తలుపు తట్టిందంటే ఒకటో తేదీ వచ్చిందని, నెల పాటు బతికేందుకు భరోసా తీసుకొచ్చిందనే ధైర్యం నాకుండేది. ఈ నెల ఒకటో తేదీ వలంటీరు వచ్చినా నాకు భరోసా తీసుకురాలేదు. వలంటీర్లు పనిచేయకూడదని ఎలక్షనోళ్లకి నువ్వు ఏదో చెప్పి ఆపించేశావంట కదా? నాలాంటి ముసలోళ్లు నీకు ఏం ద్రోహం చేశాం. ఇంతకు ముందు ఎలక్షన్లో నేను సైకిల్ గుర్తుకే ఓటు వేశా. అయినా నా మనవడు కాని మనవడు జగనయ్య మూడు వేలు డబ్బు నెల నెలా ఇంటికే పంపిస్తా ఉన్నాడు. దానిని ఆపించేశావు. ఈ నెల నేనెలా బతకాలి... నడవలేని పరిస్థితిలో నేను ఎక్కడకు వెళ్లి పెన్షన్ తీసుకోవాలి. భర్త చనిపోయాడు. కుమారుడు చూడడం లేదు. పెన్షన్‌పైనే ఆధారపడి జీవిస్తున్నా. ఇది కూడా చంద్రబాబుకు నచ్చలే. ఈ పాపం మీకు తగులుతుంది. **– అరవ శారదమ్మ, నందిమంగళం, పుత్తూరు**

జగనన్న ప్రభుత్వాన్ని ఆదరించండి



ప్రచారం చేస్తున్న వైఎస్ఆర్ సీపీ నాయకులు

పాలసముద్రం: సంక్షేమం, అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఆదరించాలని జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, పార్టీ మండల కన్వీనర్ తులసి కోరారు. మంగళవారం మండలంలోని వనదుర్గాపురం, తొట్టికండ్రిగలో వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలతో కలసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్ఆర్ సీపీని ఆదరించాలన్నారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తున్న డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మాయ మాటలతో మరోసారి మోసం చేయాలని చూస్తున్నారని తెలిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ఆర్ సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం మండల చైర్మన్ పోలయ్య, ఎంపీటీసీ సభ్యుడు గోవిందరాజ్, సర్పంచ్ మహేష్, అయ్యప్ప, నాయకులు ధనుంజయరెడ్డి, షణ్ముగరెడ్డి, వరదరాజు, చంద్రశేఖర్ రాజు, సుమన్, వేణు, ఆనందన్, మనోహర్, రవిరెడ్డి, కుట్టి, రాజామణి, సిద్ధమండడి, ఆనంద్, ప్రకాష్, భాస్కర్, గోపాల్, కృష్ణయ్య, కుమార్, నరసింహనాయుడు, మురళి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నివాళులర్పిస్తున్న ఆర్కే సెల్వమణి

పుత్తూరు: పట్టణంలోని రామానాయుడు కాలనీలో ఉంటున్న ఎలక్ట్రీషియన్ రవి ఆచారి(56) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి వారి ఇంటికి వెళ్లి రవి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్ఆర్ సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మృతుని కుటుంబానికి రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆయన మాట్లాడుతూ ఆప్తులను కోల్పోయినా మనోధైర్యంతో ముందుకెళ్లాలని, పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ



మూర్తిస్వామి కుటుంబ సభ్యులకు పరామర్శ

పట్టణానికి చెందిన ప్రముఖ గురుకుల్ మూర్తి స్వామి కుటుంబ సభ్యులను రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి పరామర్శించారు. ఇటీవల మూర్తిస్వామి పరమపదించడంతో మంగళవారం వారి ఇంటికి వెళ్లిన సెల్వమణి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూర్తిస్వామి అయ్యప్ప స్వామి ఆలయ ప్రధాన అర్చకులుగా, పుత్తూరు పట్టణ ప్రజలకు చేసిన సేవలను గుర్తు చేసుకొన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు పుష్పయాగానికి అంకురార్పణ

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పుష్పయాగానికి బుధవారం సాయంత్రం 6 నుండి 8 గంటల వరకు అంకురార్పణ నిర్వహించనున్నారు. ఆలయంలో ఫిబ్రవరి 29 నుంచి మార్చి 8వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరిగిన విషయం తెలిసిందే. బ్రహ్మోత్సవాల్లో అర్చక పరిచారకులు, అధికార అనధికారులు, భక్తుల కారణంగా తెలియక ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ యాగం నిర్వహణతో సమస్తదోషాలు తొలగిపోతాయని విశ్వాసం. ఇందులో భాగంగా ఏప్రిల్ గురువారం ఉదయం 10 నుండి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేస్తారు. మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు పుష్పయాగం జరుగనుంది. ఇందులో తులసి, చామంతి, గన్నేరు, మొగలి, మల్లె, జాజి సంపంగి, రోజా, కలువలు తదితర పలురకాల పుష్పాలతో స్వామి వారికి అభిషేకం చేస్తారు. శ్రీవారి పుష్పయాగాన్ని పురస్కరించుకుని బుధవారం జరగాల్సిన అష్టోత్తర శతకలశాభిషేకం, గురువారం నిర్వహించాల్సిన తిరుప్పావడ, నిత్య కల్యాణోత్సవం సేవలను టీటీడీ రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోండి



కవాతు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

రామచంద్రాపురం: ప్రతిఒక్కరూ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని స్థానిక ఎస్ఐ చిరంజీవి అన్నారు. మంగళవారం మండలంలోని పరమాల, కొత్తకండ్రిగ కుప్పంబాదూరు, రాయల చెరువుపేట, గ్రామాలలో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సురేష్, ధన, త్యాగ, రమణ, యోబు, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి కార్యకర్తలు కరువు



జనసేన అభ్యర్థికి టీడీపీ కండువా కప్పుతున్న థామస్

కార్వేటినగరం: టీడీపీకి కార్యకర్తలే కరువయ్యారు. దీంతో టీడీపీ శ్రేణులు జనసేన కార్యకర్తలు, పొరుగు రాష్ట్రమైన కర్ణాటకకు చెందిన తాపీమేస్త్రీలకు కండువాలు వేసి, శునకానందం పొందుతున్నారని ఓటర్లు విస్తు పోతున్నారు. సోమవారం రాత్రి టీడీపీ శ్రేణులు ఆర్కేవీబీ పేటలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వైఎస్ఆర్ సీపీని దెబ్బతీసేందుకు జనసేన పార్టీలో ఉంటున్న వారికి టీడీపీ కండువాలు వేసి, వైఎస్ఆర్ సీపీ నుంచి వందల మంది చేరినట్లు పచ్చపత్రికల్లో పిచ్చిరాతలు రాసి, పైచాచిక ఆనందం పొందారు. ఈ వింతను చూసి స్థానికులు విస్తుపోతున్నారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ కనీసం రాష్ట్రంలో ఆధార్ కార్డు లేనివారిని, ఓటుహక్కు లేనివారికి కండువాలు కప్పుతున్నారని తెలిపారు. కర్ణాటక రాష్ట్రం నుంచి బతుకుతెరువు కోసం తాపీకూలీగా వచ్చిన పశుపతికి కండువా కప్పడం, జనసేనలో ఉంటున్న వారికి తెలుగుదేశం కండువాలు వేయడంతో ఉపయోగం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.



కర్ణాటక తాపీ మేస్త్రీ పశుపతికి కండువా కప్పి, పార్టీలో చేరినట్లు వెల్లడిస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి

ఎస్వీజీపీలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం శ్రీసిటీలోని డైకిన్ ఏసీ సంస్థ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ప్లేస్‌మెంట్స్‌కు ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ విభాగాలకు చెందిన దాదాపు 90మంది డిప్లొమో విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ చూపిన 60మంది విద్యార్థులను రూ.2.2.లక్షల వార్షిక వేతనంతో కూడిన డిప్లొమో ఇంజినీరింగ్ ట్రైనీ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఆ సంస్థలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి అభినందించారు.

సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష

కార్వేటినగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామ రక్ష అని ఎంపీపీ లత అన్నారు. మంగళవారం మండలంలోని వెంకటాద్రిపురంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వైఎస్ఆర్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. 75 సంవత్సరాలుగా వెంకటాద్రిపురం గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకుండా ఇబ్బందులు పడుతున్నా గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి మారుమూల గ్రామమైన వెంకటాద్రిపురం గ్రామానికి రూ.8 కోట్లు వెచ్చించి బీటీ రోడ్డు ఏర్పాటు చేశారన్నారు. గ్రామస్తుల కోరిక మేరకు బస్సు సౌకర్యం కల్పించారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిస్వార్థంగా సేవ చేసిన మంత్రి కుమార్తె కృపాలక్ష్మిని వచ్చే ఎన్నికల్లో అత్యధిక ఓట్లతో గెలిపించాలని కోరారు. అనంతరం పలువురు వృద్ధులు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఇంటి వద్దకే పింఛన్లు అందించారని, నేడు వలంటీర్ల సేవలను టీడీపీ జీర్ణించుకోలేకపోతోందన్నారు. గతంలో పంపిణీ చేసినట్లు పంచాయతీ కార్యాలయాల వద్ద ఇస్తే నడవ లేనివారు, ఆస్పత్రులో చికిత్స పొందుతున్నవారికి ఇబ్బందులు తప్పవన్నారు. తమ లాంటి వృద్ధులను ఆదరించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికీ అధికారంలో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల మాజీ కన్వీనర్ ధనుంజయవర్మ, ఎంపీటీసీ సభ్యులు ధనశేఖర్‌యాదవ్, మురగయ్య, జేజేలు రెడ్డి, పద్మనాభశెట్టి, ఆనంద్ పాల్గొన్నారు.



వెంకటాద్రిపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎంపీపీ లత, వైఎస్ఆర్ సీపీ నాయకులు

వేడుకగా మహా కుంభాభిషేక మహోత్సవం

తిరుపతి కల్చరల్: ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వెలిసిన శ్రీతాళ్లపాక పెద్ద గంగమ్మ ఆలయ జీర్ణోద్ధరణ, పునఃప్రతిష్ఠ మహా కుంభాభిషేక మహోత్సవం మంగళవారం చేపట్టిన అంకురార్పణతో వేడుకగా ప్రారంభమైంది. శోభకృత్ నామ సంవత్సరం, ఫాల్గుణ మాసం, బహుళ దశమి గురువారం శ్రవణా నక్షత్రయుక్త వృషభ లగ్న శుభ పుష్కరాంశం రోజైన గురువారం ఉదయం 9.10 గంటలకు అమ్మవారి ఆలయంలో దేవతా యంత్రక, విగ్రహ, శిఖర కలశ స్థాపన, పునః ప్రతిష్ఠ కుంభాభిషేక మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తొలి రోజైన మంగళవారం ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో ప్రత్యేక పూజలు చేపట్టారు, వేది పండితుల వేద మంత్రోచ్ఛారణ నడుమ గణపతి హోమం, కలశ స్థాపన, వాస్తు హోమం వంటి హోమ పూజలను చేపట్టారు. సాయంత్రం 6 గంటలకు అంకురార్పణతో పాటు రాత్రి జలాధివాసం క్రతువును పూర్తి చేశారు. రెండో రోజు బుధవారం ఉదయం 10 గంటలకు పంచగవ్య అధివాసం, బింబశుద్ధి, సాయంత్రం 4గంటలకు ధాన్యాధివాసము, 5 గంటలకు పుష్పాధివాసం, గంటలకు శయ్యాధివాసం వేద పండితులు చేపట్టనున్నారు.

టీడీపీ, జనసేన దళిత వ్యతిరేక పార్టీలు



మాట్లాడుతున్న వైఎస్ఆర్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుప్పయ్య

శ్రీరంగరాజపురం: టీడీపీ, జనసేన పార్టీలు దళిత వ్యతిరేక పార్టీలని వైఎస్ఆర్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుప్పయ్య ఆరోపించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు దళితులను ఓటు బ్యాంక్‌గానే వాడుకున్నారే తప్ప ఏనాడు దళితుల అభ్యున్నతికి కృషి చేయలేదన్నారు. ఎవరైన దళితులుగా పుడతారా అన్న చంద్రబాబుకి నేడు దళితుల ఓట్లను అడిగే అర్హత లేదన్నారు. టీడీపీ, జనసేన పార్టీల్లో ఉన్న దళితులు వెంటనే ఆపార్టీలను వీడి, దళితుల అభ్యున్నతికి కృషి చేస్తున్న వైఎస్ఆర్ సీపీని ఆదరించాలన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టిన చంద్రబాబుకు వారి ఓట్లను అడిగే అర్హత లేదన్నారు. రాజకీయంగా, కార్పొరేషన్లలో ఉన్నత పదవులు ఇవ్వడంతోపాటు డిప్యూటీ సీఎంగా దళితులకు అవకాశం కల్పించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. జగనన్న సహకారంతో డిప్యూటీ సీఎం నారాయణ స్వామి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తూ, నిరుద్యోగుల ఉపాధి కల్పనకు స్మార్ట్ టీవీ పరిశ్రమను నెలకొల్పి, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నారన్నారు. పార్టీ మండల కన్వీనర్ మణి, నాయకులు కాశప్ప, జనార్దన్, మణి, మహేష్, బాబు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది

పాలసముద్రం: వేసవిలో గర్భిణులు అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. మంగళవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి ఆశా కార్యకర్తలకు ఆశా నోడల్ అధికారి సుశీల అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు వస్తున్నాయని, ఉష్ణోగ్రత రోజు రోజుకూ పెరుగుతున్నందున ఎండ ఉన్న సమయంలో బయటకు రాకూడదన్నారు. అత్యవసరంగా బయటకు రావాల్సి వస్తే ఎండ తగలకుండా గొడుగు, ముఖానికి వస్త్రం ధరించి వెళ్లాలని సూచించారు. నీరు, చల్లని పానీయాలు ఎక్కువగా తీసుకోవాలని, వడదెబ్బకు గురైనట్టు గుర్తిస్తే వెంటనే ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంలో డాక్టర్‌ను సంప్రదించాలని తెలిపారు. గర్భిణులు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలోనే ప్రసవం చేసుకోవాలన్నారు. అనంతరం వడదెబ్బ నివారణపై అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి పాల్గొన్నారు.

బాటగంగమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారికి విశేషాలంకరణ చేసి, మొక్కుకుంటున్న భక్తులు

పాలసముద్రం: మండలంలోని శ్రీకావేరిరాజుపురం పంచాయతీ ఏటుకూరిపల్లెలో ఉన్న బాట గంగమ్మకు గ్రామస్తులు మంగళవారం ప్రత్యేక పూజలు చేసి, అంబళ్లు పోశారు. ఉదయం గ్రామంలోని మహిళలు అమ్మవారికి పొంగళ్లు, అంబలి సామగ్రితో వాయిద్యాల నడుమ ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకువెళ్లారు. మధ్యాహ్నం పాల బిందెలను మహిళలు గ్రామంలో ఊరేగించి, తీసుకు వెళ్లి, అమ్మవారికి పాలాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అంబలి పోశారు. తీర్థప్రసాదాలు పంచి పెట్టారు.



అంబలి, పూజాసామగ్రితో ఊరేగింపుగా వెళుతున్న భక్తులు

టీడీపీ వేధింపులు తాళలేకే రాజీనామాలు



ఉద్యోగాలకు రాజీనామా చేసిన కలవకుంట సచివాలయం వలంటీర్లు

పెనుమూరు(కార్వేటినగరం): టీడీపీ నాయకుల వేధింపులు తాళలేకే తాము ఉద్యోగాలకు రాజీనామా చేసినట్లు కలవకుంటకు చెందిన వలంటీర్లు అన్నారు. మంగళవారం 10 మంది వలంటీర్లు ఎంపీడీఓ కోటేశ్వరరావుకి తమ రాజీనామా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు అమృతుల్లా, జునైద్, అహ్మద్ మాట్లాడుతూ కేవలం గౌరవ వేతనం తీసుకుంటూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా చిత్తశుద్ధితో పనిచేస్తున్న వలంటీర్లపై పచ్చ మూకల వేధింపులు ఎక్కువయ్యాయని ఆరోపించారు. ప్రజలకు సేవ చేసే వలంటీర్లను టెర్రరిస్టులతో పోల్చడం దారుణమన్నారు. అందుకే రాజీనామాలు చేసి, పేదరికంతో అల్లాడుతున్న తమలాంటివారికి జీవనోపాధి కల్పించిన జగనన్నకు సైనికుల్లా పని చేసేందుకు సిద్ధపడ్డామని తెలిపారు. ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారక ముందే అవ్వాతాతలఆప్యాయంగా మాట్లాడుతూ వారు పింఛన్లు అందజేసి, వారి ఆనందాన్ని చూశామని, ఎన్నికల కోడ్‌ను అడ్డుపెట్టుకుని వలంటీర్ల వ్యవస్థపై టీడీపీ నేతలు నిప్పులు చెరుగుతున్నారన్నారు. చంద్రబాబు కుటిల పన్నాగంతోనే ఈ నెల పింఛన్లు ఇవ్వలేక పోయామని ఆరోపించారు. చంద్రబాబు చేసిన మోసాలే నేడు వృద్ధులకు శాపంగా మారాయన్నారు. ఇక జగనన్న విజయమే లక్ష్యంగా ఎన్నికల ప్రచారంలో ధైర్యంగా పాల్గొంటామని, తెలుగు తమ్ముళ్లు ఇక మమ్మల్ని ఏమీ చేయలేరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదిల్‌షా, తస్మీన్, చాందిని, గౌరి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.